# పంట క్షేత్రాలే..ప్రయోగశాలలు

- రైతులకు మేలు చేసేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు
- పెట్టుబడి ఖర్చులు తగ్గించే విధానాలపై దృష్టి
- అధిక దిగుబడే లక్ష్యంగా సలహాలు, సూచనలు
- 684 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి పంట
- 1874 ఎకరాల్లో పచ్చిరొట్ట ఎరువుల వాడకం

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): వ్యవసాయంలో ఏటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతూనే ఉన్నాయి. ఎరువులు, విత్తనాల ధరతోపాటు కూలీల ఖర్చులు, యంత్ర వినియోగపు ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. ఏటా సుమారుగా రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు ఖ ర్చు పెరుగుతున్నది. దీనికితోడుగా అతివృష్టి లేక అనావృష్టి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇలాంటి పరిస్థితుల నుంచి రైతులను బయటపడేసేందుకు వ్యవసాయ అధికారులు దృష్టి పెట్టారు. పెట్టుబడులు తగ్గించే విధానాలు రైతులకు నేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### వరి విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగు..

జిల్లాలో పత్తి తర్వాత అత్యధికంగా సాగయ్యేది వరి పంట. ఈ యాసంగిలో కూడా దాదాపు 37 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. దీంతో ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 35 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. కొత్త విధానాలతో ఎకరాకు రూ. 5వేల నుంచి రూ. 10 వేల వరకు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు పంట కాలాన్ని కూడా 15 రోజుల ముందుగానే తీసుకునే వీలుంటుంది. వరి సాగులో పొలాన్ని సిద్ధం చేసి, నారుమళ్లు పెంచి నాట్లు వేసే పద్ధతిలో రైతులు తమ పెట్టుబడులతోపాటు శ్రమను కూడా పెంచుకుంటున్నారు. నారు పెంచి, నాట్లు వేసేందుకు కూలీలను అధికంగా వినియోగించుకోవాల్సి వస్తోంది. దీంతో 15 నుంచి 20 శాతం విత్తనాలు కూడా వృథా అయ్యే అవకాశం ఉంటుంది. నాట్లు వేసే పద్ధతిలో 10 నుంచి 15 రోజుల సమయం కూడా వృథా అవుతున్నది. దీంతో విత్తనాలు చల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే కూలీల ఖర్చు తగ్గడంతోపాటు, విత్తనాల వృథా, సమయం అదనంగా వెచ్చించాల్సిన అవసరం ఉండదు. జిల్లాలో 389 మందికి చెందిన వ్యవసాయ క్షేత్రాల్లో 684 ఎకరాల్లో విత్తనాలు వెదజల్లి వరి సాగుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### జీవన, పచ్చి రొట్ట ఎరువులు వినియోగించేలా...

రైతులు అధిక దిగుబడులపై ఆశతో రసాయన ఎరువులను విపరీతంగా వినియోగిస్తున్నారు. దీని ద్వారా ఖర్చులు అధికం కావడమే తప్పా, అధిక ఎరువుల వినియోగంతో పంటలకు ఎలాంటి ఉపయోగం కలగడం లేదు. రైతులు రసాయన ఎరువులకు బదులుగా జీవన ఎరువులు, పచ్చి రొట్ట ఎరువులను వినియోగించే విధంగా అధికారులు ప్రోత్సహించేందుకు ప్రణాళికలు తయారు చేశారు. రసాయన ఎరువుల రూపంలో నేలలో వేస్తున్న భాస్వరం కరుగకపోవటంతో పంటలకు ఉపయోగపడడం లేదు. ఈ భాస్వరం జీవన ఎరువులైన పశువుల ఎరువులతో కలిపి వాడడం వలన భాస్వరం కరిగి పంటలకు అందేవిధంగా తయారువుతుంది. ఈ విధానాన్ని రైతులకు వివరించేందుకు అధికారులు ప్రయోగాత్మకంగా ఈ పద్ధతిని అమలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. ఇవే కాకుండా 849 రైతులకు చెందిన 1874 ఎకరాల్లో పచ్చిరొట్ట ఎరువుల ద్వారా వ్యవసాయాన్ని చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. వచ్చే యాసంగి, వర్షాకాలపు పంటలలో ఈ విధానాలను అమలు చేయనున్నారు.

# వదంతులు నమ్మొద్దు..

- రూ.500 సిలిండర్‌కు, ఈకేవైసీకి సంబంధం లేదు..
- 'ఉజ్వల' కనెక్షన్లకే ఈ నెల 31 వరకు తుది గడువు
- మిగతా కనెక్షన్‌దారులకు నితరంతర పక్రియ
- గ్యాస్ బుకింగ్ ఎల్లప్పుడు చేసుకోవచ్చు..
- ఏజెన్సీల ఎదుట బారులు తీరొద్దంటున్న ఆయిల్ కంపెనీలు

నిర్మల్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ) : గత నెలలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీల్లో ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) సిస్టంను ప్రవేశ పెట్టింది. ముందుగా ఉజ్వల కనెక్షన్లు ఉన్న గ్యాస్ వినియోగదారుల ఈ కేవైసీని పూర్తి చేయాలని ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీఎల్ కంపెనీలు ఈ కేవైసీని ప్రారంభించాయి. అయితే చాలా మంది వినియోగదారులు ఈ నెలాఖరుకే తుది గడువు ఉందంటూ వస్తున్న వదంతులను నమ్మి ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ ఏజెన్సీలకు పరుగులు తీస్తూ, వాటి ఎదుటబారులు తీరుతున్నారు. నిర్మల్ జిల్లావ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న 'ఉజ్వల' గ్యాస్ కనెక్షన్లు 37,328 ఉన్నాయి. మిగతా అన్ని రకాల కనెక్షన్లు కలిపి 2,49,990 వరకు ఉండగా, వీరంతా ఈ కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీల ఎదుట క్యూ కడుతున్నారు. వాస్తవానికి కేవలం ఉజ్వల కనెక్షన్లకే ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నది. మిగతా కనెక్షన్లకు ఎలాంటి గడువు లేదని, ఇది నిరంతర ప్రక్రియ అని అధికారులు చెబుతున్నారు. దశలవారీగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏజెన్సీలు వారి పరిధిలోని వినియోగదారుల సెల్‌ఫోన్‌లకు సమాచారం అందిస్తున్నారు. గ్యాస్ కస్టమర్ నంబర్, ఆధార్ నంబర్‌తో వినియోగదారుడు గ్యాస్ ఏజెన్సీకి వెళితే.. సిబ్బంది ఆ వివరాలన్నీ నమోదు చేసి, వేలిముద్ర తీసుకొని ఈ కేవైసీని పూర్తి చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలో పేరు ఉన్న వినియోగదారుడు ఒక్కరే వచ్చి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఈ కేవైసీ లేకపోతే గ్యాస్ బుకింగ్ కాదనే పుకార్లను వినియోగదారులు నమ్మొద్దని నిర్వాహకులు చెబుతున్నారు.

### ఆందోళన అవసరం లేదు..



రేషన్ కార్డుల తరహాలోనే ఎల్పీజీ వినియోగదారులు కూడా తమ సమీప ఏజెన్సీలకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం ఇది కేంద్రం జారీ చేసిన ఉజ్వల కనెక్షన్లకే వర్తిస్తున్నది. ఈ కనెక్షన్లు ఉన్న వా రు ఈ నెల 31లోపు ఈ కేవైసీ చేయించుకోవాలి. మిగతా వారికి ఎలాంటి గడువు విధించలేదు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది నిరంతర ప్రక్రియ. ఇప్పటికిప్పుడు ఈ కేవైసీ చేయించుకోకున్నా గ్యాస్ బుకింగ్, సరఫరా యథావిధిగా ఉంటుంది. ఈ నెల 16 న జగిత్యాలలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ సమావేశం ఉన్నది. గ్యాస్ వినియోగదారులకు ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

**-శ్రీనివాస్ గౌడ్, మేనేజర్, ఇండేన్ సర్వీసెస్, నిర్మల్**

# కారులో మంటలు



తగలబడుతున్న కారు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 14: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మావల మండల కేంద్రం సమీపంలో గురువారం సాయంత్రం ఓ కారులో మంటలు చెలరేగాయి, ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన రంగినేని శిల్ప తన కూతురు మోక్షను మావల మండలకేంద్రంలోని ఎస్‌ఆర్ ప్రైమ్ స్కూల్ నుంచి కారులో తీసుకొని తిరిగి వస్తుండగా, జాతీయ రహదారిపై కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన శిల్ప తన కూతురుతో కలిసి వెంటనే కారు నుంచి బయటికి వచ్చేశారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

# అసలే చలికాలం.. ఆరోగ్యం జాగ్రత్త

- అప్రమత్తతే మేలు: డాక్టర్ రోషిణి



డాక్టర్ రోషిణి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్14: ప్రస్తుతం చలి తీవ్రత పెరిగింది. చిన్నా పెద్దా అంతా జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఇది. కాగా, చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రిమ్స్ కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రోషిణి పలు సూచనలు చేశారు.

### చలికాలంలో వచ్చే జబ్బులు

ముఖ్యంగా ముక్కుకు సంబంధించిన జబ్బులు వస్తుంటాయి. ఎలర్జిక్ రైనైటీస్, ఎలర్జిక్ రైనో సైనోసైటీస్, ఎంజిల్ పాలిక్

**ఎలర్జిక్ రైనైటీస్ లక్షణాలు:** ఎలర్జిక్ రైనైటీస్ వల్ల ముక్కు నుంచి నీరు కారడం, తుమ్ములు రావడం, కళ్లు దురదపెట్టడం, కొండ నాలుక వద్ద దురదపెట్టడం లాంటివి వస్తుంటాయి. వీటి వల్ల ముక్కు మూసుకుపోవడం జరుగుతుంది.

**ఎలర్జిక్ రైనోసైనోసైటీస్ లక్షణాలు:** ఎలర్జి సమస్య వల్ల సైనోసైటీస్ పెరుగుతుంది. సైనోసెస్‌లో మాంసం పేరుకుపోయి ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. సైనటీస్ వల్ల తలనొప్పి, తల బరువు ఉండడం, ఆఫీస్‌లో పనిచేయకపోవడం, ముక్కు నుంచి నీరు కారడం, ముక్కు నుంచి గొంతులోకి చీముడు కారడం వంటివి జరుగుతాయి. ముక్కులో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతుంది. ముక్కులు బ్లాక్ కావడం వల్ల గాలి ఆడకపోవడం జరుగుతుంది. ఆస్తమా వంటి జబ్బు వచ్చే అవకాశం ఉంది.

### చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చలికాలంలో ముక్కు సమస్యలు వచ్చినపుడు ముందు జాగ్రత్తగా ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించాలి. సొంత వైద్యం చేసుకోకూడదు. రక్త పరీక్షలు, నోసల్ ఎండోస్కోపి చేయించుకుని వైద్యుల సలహాలు తీసుకోవాలి. అవసరమైతే ఇమినో థెరపీ చేయించుకోవాలి. గాలి ఆడడం లేదని ముక్కులో చుక్కల మందు వేయకూడదు. ఐదు రోజులు దాటితే సర్జరీకి దారి తీస్తుంది.

### నివారణ చర్యలు

ఎలర్జీ ఎలా వచ్చిందనేది ముందుగా గుర్తించాలి. చలిలో ఎక్కువగా తిరగకూడదు. చలిలో స్నానాలు చేయవద్దు, ఏసీలో ఎక్కువ సేపు గడపవద్దు. చల్లని పదార్థాలు తీసుకోవడం, గడ్డి పనులు చేయడం, దుమ్ములో పని చేయడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. చలిలో బయటకు వెళ్లినపుడు ఉన్ని దుస్తులు ధరించాలి. ఎలర్జీ సమస్యలు వచ్చినపుడు వెంటనే వైద్యున్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి. ఇదే మేలు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత

కౌటాల, డిసెంబర్ 14: మండలంలోని గురుడుపేట గ్రామంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం ఉదయం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందిన పక్క సమాచారంతో కౌటాల మండలంలోని గురుడుపేటలో తనిఖీలు చేపట్టగా ఎలకుచ్చుల పోశన్న ఇంట్లో నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సందీప్ కుమార్, సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్, తదితరులున్నారు.

# నేడు అవగాహన సదస్సు

నిర్మల్ టౌన్, డిసెంబర్ 14: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తన డీలర్లకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏడీఏ వినయ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు రైతు వేదికలో నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరవుతారని తెలిపారు. యాసంగిలో విత్తన డీలర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ విధానం, తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

# దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి: కలెక్టర్ హేమంత్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 14 :దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆదర్శ బాలికల క్రీడల పాఠశాల మైదానంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి,జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవితో కలిసి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి 16 ఏండ్ల వరకు దివ్యాంగులకు పరుగు పందెం, షాట్‌పుట్, క్యారమ్, చెస్, జావెలెన్ త్రో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతి ప్రదానం చేస్తాని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, ఏపీడీవో క్షేత్రయ్య, సంక్షేమ అధికారులు, పీడీలు, పీఈటీలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను తిలకిస్తున్న కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్ రావ్

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677